## రోజుకి కనీసం 10 సేవలు అందించాలి: కలెక్టర్

విశాలాంధ్ర - గంట్యాడ: గంట్యాడ మండలం సిరిపురం గ్రామ సచివాలయాన్ని జిల్లా కలెక్టర్ ఎ.సూర్య కుమారి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామ సచివాలయం ద్వారా రోజుల్లో కనీసం 10 సేవలు అందించాలని కలెక్టర్ సిబ్బందికి సూచించారు గ్రామాలలో విద్యుత్ బిల్లులన్నీ సచివాలయాల ద్వారా చెల్లించేలా చూడాలన్నారు. గ్రామంలో ఉన్న గర్భిణీల నమోదు రిజిస్టర్‌ను చూసి స్పాట్ ఫీడింగ్ ఎంతమంది వస్తున్నారని ఐసిడిఎస్ సిబ్బందిని అడిగారు. హెచ్‌బీ పరీక్షలు, పౌష్టికాహారం బరువు, తదితర విషయాలపై ఆరా తీశారు. అంగ న్వాడీ కేంద్రంలో అందుతున్న సేవ లపై ఆరా తీశారు. పాఠశాలలో భోజనం నాణ్యత గురించి అడిగి తెలుసుకున్నారు. స్టడీ సర్టిఫికెట్ గురించి ఎన్ని దరఖాస్తులు వచ్చాయి ఎన్ని జారీ చేశారని అడిగారు. 35 దరఖాస్తులు రాగా 20 జారీచేసామని డిజిటల్ అసిస్టెంట్ తెలిపారు. కలెక్టర్ వెంట డీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ రమణకుమారి, ఐసీడీఎస్ పీఓ శాంతకుమారి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సీతల వర్మ, తహశీల్దార్ ప్రసన్న రాఘవ, ఎంపీడీవో భవాని, సీడీపీఓ ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్ల సంక్షేమానికి కృషి చేయాలి

విశాలాంధ్ర - విజయ నగరం టౌన్: ఆటో మొబైల్ వ్యాపారులు నిరు పేదలైన ఆటోడ్రైవర్ల సంక్షేమానికి కృషి చేయా లని డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి విజ్ఞప్తి చేశారు. గురువారం పట్టణంలోని అయ్యన్నపేట రోడ్డు కామాక్షి నగర్‌లో సూర్య కళ ఆటోమోటివ్స్ షాపును ఆమె ప్రారం భించి మాట్లాడారు. వ్యాపారులు కేవలం వ్యాపార దృక్పథమే కాకుండా వారు చేస్తున్న వ్యాపార రంగంపై ఆధారపడి జీవించే వారి సంక్షేమానికి కూడా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 42వ వార్డు కార్పొరేటర్ పిన్నింటి కళావతి, పిన్నింటి సూర్యనారాయణ, పిన్నింటి.సూర్య ప్రవీణ్ కుమార్, ఆరికితోట తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి లేకనే వలసలు, మత్స్యకారుల మరణాలు

### జనసేన నాయకురాలు లోకం మాధవి

విశాలాంధ్ర - పూసపాటిరేగ: ఉపాధి లేకనే వలసలు, మత్స్యకారుల మరణాలు చోటు చేసుకుంటున్నాయని జనసేన నాయకురాలు లోకం మాధవి అన్నారు. మండలం చింతపల్లి పంచాయతీలో జనసేన నాయకురాలు లోకం మాధవి చనిపోయిన మత్స్యకారుల కుటుంబాన్ని పరామర్శించి మాట్లాడారు. నెల్లిమర్ల నియోజకవర్గంలో ఉన్న మత్స్యకార గ్రామాలు చాలా దుర్భర పరిస్థితితుల్లో ఉన్నాయని దీనికి ప్రభుత్వ వైఫల్యమే కారణమన్నారు. మత్స్యకార గ్రామాల ప్రజలు వారి కుటుంబాలని విడిచిపెట్టి వారి జీవనోపాధి కోసం ఎంతో దూరం వలసలు వెళ్ళవల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ఈ పరిస్థితే ఇద్దర మత్స్యకారల చావుకి కారణమైందన్నారు. జెట్టి నిర్మాణం, ఫిషింగ్ హార్బర్ నిర్మనించి ఉపాధి అవకాశాలు కల్పిస్తే వలసలను అరికట్టవచ్చన్నారు. చనిపోయిన మత్స్యకారుల కుటుంబానికి ఆర్థికసహాయం అందజేశారు. అదే పంచాయతీలో ఇల్లు దగ్ధం అయిన కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికసాయం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

### క్షయ వ్యాధి నియంత్రణలో

## ప్రజా భాగస్వామ్యం అవసరం

### కలెక్టర్ సూర్యకుమారి

విశాలాంధ్ర - విజయనగరం: క్షయ వ్యాధి నియంత్రణలో ప్రజా భాగస్వామ్యం అవసరమని జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి పేర్కొన్నారు. రెండు వారాలకు మించి దగ్గు వస్తే తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా జిల్లా క్షయ వ్యాధి నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక కలెక్టరేట్ నుంచి చేపట్టిన అవగాహన ర్యాలీని ఆమె ప్రారంభించారు. వ్యాధి నిర్ధారణ అయిన తర్వాత వైద్యుల సూచనలు పాటించాలని, తగిన మోతాదులో మందులు తీసుకోవాలని హితవు పలికారు. ర్యాలీలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డా. ఎస్.వి.రమణ కుమారి, జిల్లా క్షయ వ్యాధి నియంత్రణ విభాగం అధికారి డా. రామేశ్వరి ప్రభు, జిల్లా సమన్వయ అధికారి(టీబీ కంట్రోల్) కుమార్, ఇతర వైద్యులు, మెడికల్ ఆఫీసర్లు, ఏఎన్ఎంలు, ఆశాలు, వివిధ కళాశాలల నర్సింగ్ విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి కనువిప్పు కలగాలి

### - లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి

విశాలాంధ్ర - శృంగవరపుకోట: వచ్చే సాధారణ ఎన్నికల్లో వైనాట్ 175 అని చెప్పి బీరాలు పలికిన రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలపై కనువిప్పు కలగాలని లోక్ సత్తాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అన్నారు. విజయనగరం జిల్లా శృంగవరపుకోటలో విలేకరులతో భీశెట్టి శుక్రవారం మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్ అంటే భయంతోనో, భక్తితోనో తప్పనిసరి పరిస్థితుల్లో వంగి వంగి దండాలు పెట్టే సొంత పార్టీ ఎమ్మెల్యేలు ప్రతిపక్ష పార్టీ అభ్యర్థికి మద్దతు ప్రకటించడం చిన్న విషయం కాదని అన్నారు. అధికార పార్టీకి దెబ్బమీద దెబ్బ తగలడం వెనుక ఆ పార్టీపై ప్రజల విశ్వాసం కోల్పోతున్నట్టు కనిపిస్తోందని అన్నారు. ముఖ్యమంత్రి నియత్ృత్వంపై ఎమ్మెల్యేలు, మంత్రులు విసుగుతో ఉన్నట్లు తెలుస్తోందని భీశెట్టి వ్యాఖ్యానించారు. ఆంధ్రప్రదేశ్‌కి జీవనాడిగా పిలుచుకునే పోలవరం ప్రాజెక్టుపై అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రకటనల వలన ప్రజల్లో గందరగోళం చెలరేగిందని వాస్తవాలు తెలిపేందుకు ముఖ్యమంత్రి జగన్ అఖిలపక్షం ఏర్పాటు చేయాలని భీశెట్టి డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్.అండ్ ఆర్ కోసం ఖర్చుచేసిన రూ.2,600 కోట్లను కేంద్ర ప్రభుత్వం ఎందుకు విడుదల చేయలేదో ప్రజలకి తెలియాలంటే ముఖ్యమంత్రి అఖిలపక్షం ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి కాంద్రేగుల ప్రసాద్, మహిళా సత్తా రామలక్ష్మి, నాగేశ్వరరావు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్యంపై సచివాలయ సిబ్బందికి శిక్షణ

విశాలాంధ్ర - భోగాపురం: జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమంలో భాగంగా పారిశుద్యంపై, ప్రజలు జీవన ప్రమాణాలను పెంపొందించాలనే ఏకైక లక్ష్యంతో ఎంతో చిత్త శుద్ధితో రాష్ట్ర ప్రభుత్వం అనేక ప్రణాళికలను రూపొందించడంతో జిల్లాలో గల ప్రతీ మూడు ఉత్తమ గ్రామ పంచాయతీలను లోకల్ ట్రెనింగ్ సెంటర్‌లుగా గుర్తించి గ్రామ పంచాయితీ ,సచివాలయ సిబ్బందికి పారి శుద్యంపై శిక్షణా ఇస్తున్నట్టు ఎంపీడీఓ బంగారయ్య తెలిపారు. భోగాపురం మండలంలో నందిగామ గ్రామ పంచాయతీలోను, చీపురుపల్లి మండలంలో కర్లాము, గుర్ల మండలంలో జమ్మూపేట గ్రామ పంచాయితీలోను శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేసారని తెలిపారు. ఈ శిక్షణ 6వ తేదీ వరకు వుంటుందన్నారు. తడిచెత్త పొడిచెత్త ఏ విదంగా వేరుచేసి, ఎస్ డబ్ల్యూ పి సి షెడ్‌కు తరలించి అక్కడ ఏ విదంగా సీల్ చేయాలి తదితరాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌పీఓ మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

## తడి-పొడి చెత్తపై అవగాహన

విశాలాంధ్ర - చీపురుపల్లి: మండలంలోని కర్లామ్, నిమ్మలవలస, వంగర మండలం అరసాడ, కోప్పరవలస సచివాలయ సిబ్బందికి, సర్పంచ్‌లకు, గ్రీన్ అంబాసిడర్స్‌కు తడి-పొడి చెత్తపై అధికారులు అవగాహన కల్పించారు. తడి చెత్తను, పొడి చెత్తను ఇంటి నుండి ఎలా సేకరించాలి, సేకరించిన తడి చెత్తను వర్మీ కంపోస్ట్‌గా ఎలా ఉత్పత్తి చెయ్యాలి, డ్రై వేస్ట్‌ను ఎలా విక్రయించాలి అన్న దానిపై వివరించారు. గ్రామంలో మృతిచెందిన జంతు వులను పూడ్చడానికి కేటాయించిన స్థలాన్ని చూపిం చారు. బిల్డింగ్ వేస్ట్ మెటీరియల్‌కు ఏర్పాటుచేసిన ఒక యార్డ్ ను చూపించి వివరించారు.

## ఇంకుడు గుంతల నిర్మాణానికి శంకుస్థాపన

విశాలాంధ్ర - బొబ్బిలి: ఇంకుడు గుంతలు నిర్మించి భూగర్భ జలాలు పెరిగేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎంపీపీ శంబంగి లక్ష్మీ వేణుగోపాలనాయుడు అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఇం కుడు గుంతలు నిర్మాణానికి ఆమె భూమి పూజ చేశారు. ఇంకుడు గుంతలను తయారు చేసు కోవడం ద్వారా భూగర్భ జలాలను వృద్ధి చేయె చ్చని ఆమె పేర్కొన్నారు. వెలుగు కార్యాలయంలో లబ్ధిదారులకు ఎంపీపీ శంబంగి లక్ష్మీ, వేణు గోపాల నాయుడు చేతుల మీదుగా నాటుకోళ్ల పంపిణీ చేశారు. అనంతరం వెలుగు కార్యాల యంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు మిషన్ శిక్షణా కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సంకిలి శాంత కుమారి, ఎంపీడీఓ అల్లు భాస్కరరావు పాల్గొన్నారు.

## పది విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ

విశాలాంధ్ర - తెర్లాం: మండలంలోని జెడ్పీహెచ్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు తహశీల్దార్ రాజేశ్వరరావు పరీక్షా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా రాజేశ్వరరావు మాట్లాడుతూ భవిష్యత్తుపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండి దృఢ సంకల్పం చేసుకొని నిరంతరం శ్రమిస్తే సాధించలేనిది ఏదీ వుండదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ జె.త్రినాధరావు, హెచ్ఎం పాపారావు, డిప్యూటీ తహశీల్దార్ సత్యనారాయణ, సీఎస్‌డీటీ భాస్కర్‌రావు, రీ సర్వేయర్ రవికుమార్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ కృష్ణమూర్తి, మండల సర్వేయర్ ఎం.వెంకటరమణ, వీఆర్వోలు శ్రీనివాసరావు, జనార్ధన్ మాస్టర్ పాల్గొన్నారు.

## సీతం కళాశాలలో ఆంగ్లభాషా నైపుణ్యాలపై కార్యశాల

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: సీతం ఇంజనీరింగ్ కళా శాలలో శుక్రవారం ఆంగ్లభాషా నైపుణ్యాలపై రెండు రోజుల కార్యాశాల ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా విచ్చేసిన కె.చంద్ర శేఖర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ పదాల భాషాజ్ఞానం, ఆంగ్ల వ్యాకరణం, వాక్య నిర్మాణం సరిగా ఉండాలని, వినడం, మాట్లాడటం, చదవడం, వ్రాయడం వంటి నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో లైఫ్ స్కిల్స్ ట్రైనర్ జెట్లీ మాట్లాడుతూ విద్యార్థులు కొత్త విషయాలు నేర్చుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డా మజ్జి శశిభూషణ్‌రావు, కళాశాల ప్రిన్సిపాల్ డా డివి రామ్మూర్తి, ఇంగ్లీష్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వార్షిక పన్నులు చెల్లించాలి

విశాలాంధ్ర - రామభద్రపురం: జాతీయ రహదారిపై తిరిగే వాహనాలకు తప్పనిసరిగా వార్షిక పన్నులు చెల్లించాలని శ్రీకాకుళం విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ సిఐ బి.సింహాచలం అన్నారు. శుక్రవారం తారాపురం సమీపంలో 26వ నెంబర్ జాతీయ రహదారిపై పెట్రోల్ బంకు వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక లోడులతో వెళ్తున్న వాహనాలపై కేసులు నమోదు చేశారు. ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, వాహనానికి సంబంధించి అన్ని పత్రాలు సక్రమంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సాలూరు మోటారు వాహనాల తనిఖీ ఇన్‌స్పెక్టర్ జేవీఎస్ ప్రసాదు, కానిస్టేబుల్ పురుషోత్తం పాల్గొన్నారు.

## పాలథిన్ విక్రయిస్తే కఠిన చర్యలు: కమిషనర్

విశాలాంధ్ర - నెల్లిమర్ల: పాలిథిన్‌ను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ బి.బాలాజీ ప్రసాద్ వెల్లడించారు. నెల్లిమర్ల నగరపంచాయతీ పరిధి మొయిద జంక్షన్ లో షాపులపై శుక్రవారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్, ఇయర్ బడ్స్, బెలూన్లు, ప్లాస్టిక్ ప్లేట్లు, కప్పులు, గ్లాసులు, పోర్కులు, కప్పులు దుకాణదారుల నుంచి స్వాధీనం చేసుకుని అపరాధ రుసుం విధించారు. గుడ్డ సంచులను వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ బి శ్రీనివాసరావు, నగరపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## భవిష్యత్తు అంతా ఇ-వాహనాలదే: వీసీ రాజు

విశాలాంధ్ర - నెల్లిమర్ల: రాబోయే తరం అంతా ఇ-వాహనాలపైనే ఆధారపడాల్సి వస్తుందని సెంచూ రియన్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు అన్నారు. శుక్రవారం విశ్వవిద్యాల యంలో ఏర్పాటు చేసిన ఎలక్ట్రిక్ వెహికల్స్ డిజైన్ అండ్ అసెంబ్లీ అనే అంశంపై ఏర్పాటు చేసిన రెండు రోజుల వర్క్ షాప్‌నకు ఆయన చీఫ్ పాట్రన్‌గా పాల్గొని మాట్లాడారు. శిలాజ ఇంధనాలకు ప్రత్యామ్నాయం ఎలక్ట్రిక్ వాహనాలేనని అన్నారు. శ్రావణ్ షిప్పింగ్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.సాంబశివరావు మాట్లాడుతూ సవాళ్లను అవకాశాలుగా మార్చుకోవాలన్నారు. రోజుకి 16 గంటలు పనిచేసేతత్వం అలవరచు కోవాలన్నారు. సీతమ్ మెమోరియల్ స్కాలర్ షిప్‌ను కె.లావణ్యకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీతం ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ ఎం.శశిభూషణరావు, కుమార్ రాజా, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పీఎస్వీ రమణారావు, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.ఎస్.వర్మ, డాక్టర్ కెవిజి కృష్ణమూర్తి, అసోసియేట్ డీన్ డాక్టర్ సన్నీడియోల్, మెకానికల్ విభాగాధిపతి దీపక్ తదితరులు పాల్గొన్నారు.



## పిల్లలు, గర్భిణీలు అంగన్వాడీ కేంద్రంలోనే తినాలి

### కలెక్టర్ నిశాంత్ కుమార్

విశాలాంధ్ర - పార్వతీపురం: పిల్లలు, గర్భిణీలు సంపూర్ణ పోషణ క్రింద ఇస్తున్న పౌష్టికాహారంను అంగన్వాడి కేంద్రంలోనే తినాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ స్పష్టం చేశారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు అధికారులతో జిల్లా కలెక్టర్ శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో రక్త హీనతతో బాధపడుతున్న వారి సంఖ్య గణనీయంగా తగ్గాలని, అందుకు అంగన్వాడీ కేంద్రాలు ప్రధాన కేంద్రాలు కావాలని ఆయన స్పష్టం చేశారు. అంగన్వాడీ కేంద్రాల పరిధిలో రక్త హీనతతో బాధపడుతున్న గర్భిణీలు, బాలింతలు, తక్కువ బరువు ఉన్న చిన్నారులను ఇప్పటికే గుర్తించడం జరిగిందని వారందరికీ కేంద్రంలోనే ప్రతి రోజూ పౌష్టికాహారం ఇచ్చి అచ్చటనే తినేటట్లు చేయాలని ఆయన ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రంలో హాజరై ఆహారం తీసుకున్న వారి హాజరు విధిగా వేయాలని ఆయన ఆదేశించారు. ఇందులో నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు తీసుకుంటామని, అవస రమైతే సస్పెన్షన్ చేస్తామని ఆయన తెలిపారు. సీతంపేట, కురుపాం, భద్రగిరి, పార్వతీపురం ప్రాజెక్టుల పరిధిలో పిల్లలు, గర్భిణీల హాజరు తక్కువగా ఉందని దీనిపై దృష్టి సారించాలని ఆయన ఆదేశించారు. పునరుత్పత్తి, చిన్నారుల ఆరోగ్య గుర్తింపు (ఆర్.సి.హెచ్ ఐడి) కార్డు ఈ నెల 25 నాటికి మ్యాప్ చేయాలని జిల్లా కలెక్టర్ అన్నారు. ఒక్క కేసు కూడా పెండింగ్ ఉండరాదని ఆయన స్పష్టం చేశారు. ఆరు సంవత్సరాల లోపు వయస్సు గల పిల్లల ఆధార్ అప్‌డేట్ చేయాలని ఆయన ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి కె.విజయ గౌరి తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీలో మహా పంచాయితీ విజయవంతం

విశాలాంధ్ర - బెలగాం : సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన పిలుపులో భాగంగా ఈనెల 20వ తేదీన ఢిల్లీలో రామ్ లీలా మైదానంలో జరిగిన మహా పంచాయతీ కార్యక్రమం జయప్రదం చేయడం జరిగిందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బుడితి అప్పలనాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పార్వతీపురం మన్యం జిల్లా సీపీఐ జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఆదాని, అంబానీ వంటి సంస్థలకు ఊడిగం చేయటానికి దేశ ఆహార భద్రతకు ముప్పు వాటిల్లే రైతు వ్యతిరేక మూడు నల్ల చట్టాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకు వచ్చిందని, ఆ చట్టాలను వెనక్కి తీసుకోవాలని ఢిల్లీ నడిబొడ్డున లక్షలాది మంది రైతాంగం 13 నెలల పాటు కరోనా కష్టకాలంలో ప్రాణాలకు తెగించి పోరాటం చేస్తే, పోరాటాన్ని నీరుగార్చటానికి సమాజాన్ని తప్పుదోవ పట్టించడానికి ఆ పోరాటంలో ఉగ్రవాదులు చొరబడ్డారని, ఖలిస్తాన్ ఉద్యమకారులు నడుపుతున్నారని, ఉద్యమాన్ని రైతుల, ప్రజా బాహు నుంచి దూరం చేయటానికి దేశ ప్రధాని నరేంద్ర మోడీ వారి మంత్రివర్గం పడరాని పాట్లు పడ్డారన్నారు. ఉద్యమాన్ని ఎగతాళి చేసిన పాలకపక్షం ఉద్యమ నడిబొడ్డుకు పోయి దేశ ప్రధాని నరేంద్ర మోడీ ఉద్యమానికి క్షమాపణ చెప్పారని అదే సమయంలో తను తీసుకొచ్చిన రైతు వ్యతిరేక మూడు నల్ల చట్టాలను రద్దు చేస్తామని హామీ ఇచ్చారని, అంతేకాకుండా ఆ ఉద్యమం సందర్భంగా 750 మంది చనిపోగా ఆ రైతు కుటుంబాలను ఆదుకుంటామని ప్రకటించారని అయినా ఇప్పటికీ నెరవేర్చలేదన్నారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీలను నెరవేర్చాలని లేనిపక్షంలో ఈనెల 30వ తేదిన కార్యాచరణ రూపొందించుకొనుట కొరకు ఢిల్లీలో 500 సంఘాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు ప్రకటించారన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు వెలమల సత్యనారాయణ, ఈవి నాయుడు, పోల సింహాచలం, మువ్వల మురళీమోహన్ జామి వెంకట్ నాయుడు యామల సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

## ప్రాధాన్యత పనులు వేగవంతం చేయండి

విశాలాంధ్ర - కురుపాం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని చేపట్టిన పనులు గడపగడపకు మన ప్రోగ్రాంలో నిర్దేశించిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని పంచాయతీరాజ్ ఈఈ ఎస్.రాధారాణి అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఏఈ పి.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు ఏర్పాటు చేసిన రివ్యూ సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు.

మార్చి ఫైనాన్షియల్ ఇయర్ పూర్తి అవుతున్న సందర్భంగా పనులు పూర్తి చేయడమే కాకుండా బిల్లులు అప్లోడ్ కూడా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 20 సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## ఆదివాసీలను తరిమికొట్టే ప్రయత్నాలు మానుకోవాలి

### సిపిఐ(ఎం.ఎల్) జిల్లా కార్యవర్గ సభ్యులు పి.సంగం

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: అనకాపల్లి జిల్లా కొత్త వీధి గ్రామం రెవెన్యూ పరిధిలో లేదని చెప్పి ఆదివాసీలను గెంటేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, దీనిని సిపిఐ(ఎం.ఎల్) లిబరేషన్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు

పి.సంగం అన్నారు. ఈ మేరకు ఆ గ్రామ ప్రజలకు మద్దతుగా శుక్రవారం ఆయన పార్వతీపురం పట్టణం, నవిరి కాలనీలో నిరసన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. అనకాపల్లి జిల్లా, చీడికాడ మండలం, కోణం రెవిన్యూ పరిధి, సర్వే నంబర్ 289లోని భూమిని దశాబ్దాలుగా ఆదివాసీలు సాగు చేసుకుంటూ.. అదే భూమిలో కొత్తవీధి అనే గ్రామాన్ని కూడా కట్టుకొని జీవిస్తున్నారని, ఈ క్రమంలో అక్కడ ఆదివాసీల భూములను రికార్డులలో తొలగించి, ఆ గ్రామమే లేకుండా చేసి, వారి భూమిని లాక్కొనేందుకు కబ్జాదారులు రెవెన్యూ అధికారుల సహాయంతో ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. గిరిజన, హరిజన, బడుగు, బలహీన వర్గాల హక్కులను కాలరాస్తే లిబరేషన్ పార్టీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎ.దామోదర్, ఆర్.గౌరు నాయుడు, టి.ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## గృహ నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలి

### ఆర్డీఓ హేమలత

విశాలాంధ్ర - సీతానగరం: గృహనిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలని పార్వతీపురం రెవిన్యూ డివిజనల్ అధికారి, పార్వతీపురం డివిజన్ గృహ నిర్మాణ ప్రత్యేక అధికారి కె.హేమలత అన్నారు. శుక్రవారం మండలంలోని జోగిపేట జగనన్న కాలనీ లే అవుట్‌ను ఆమె తనిఖీ చేశారు. 24 గృహాల్లో ఆరు గృహాలు నిర్మాణం పూర్తికావడం, మిగిలిన గృహాలు వివిధ దశలలో ఉండటాన్ని గమనించారు. ఏప్రిల్ 15 నాటికి గృహ నిర్మాణాలు పూర్తిచేయాలని ఆమె స్పష్టం చేశారు. లబ్దిదా రులను మరింత అవగాహన చేయాలని, త్వరగా నిర్మాణాలు చేయుటకు అన్ని విధాలా సహకరించాలని ఆదేశించారు. మౌళిక సదుపాయాల కల్పనకు జిల్లా కలెక్టర్ పనులు మంజూరు చేసిన మేరకు పనులు పూర్తి చేయాలని ఆమె పేర్కొన్నారు. ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న గృహ నిర్మాణాలు సకాలంలో పూర్తి చేసి ఆదర్శంగా నిలవాలని ఆమె తెలిపారు. వచ్చే మూడువారాల్లో అన్నిగృహాలు పూర్తి కావాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సింహాచలం, సెక్రటరీ కిరణ్, గృహ నిర్మాణ శాఖ అధికారి జానకీరాం, పప్పల కృష్ణ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ చందన, వాలంటీర్లు పాల్గొని ఆమెకు లక్ష్యాలు నెరవేర్చడానికి కృషి చేస్తామన్నారు.

## నియోజకవర్గ సమస్యలపై అసెంబ్లీలో చర్చించిన ఎమ్మెల్యే అలజంగి

విశాలాంధ్ర - పార్వతీపురం: పార్వతీపురం నియోజకవర్గంలో సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ ఎమ్మెల్యే జోగారావు శుక్రవారం శాసన సభలో మాట్లాడారు. 9వ రోజు ఏపీ అసెంబ్లీ సమావేశాలలో పాల్గొన్న పార్వతీపురం నియోజకవర్గం ఎమ్మెల్యే అలజంగి జోగారావు నియోజకవర్గ సమస్యలపై గళమెత్తారు. అసెంబ్లీ స్పీకర్ సాక్షిగా ప్రధాన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం చేయాలని కోరారు. పార్వతీపురం నియోజకవర్గం పరిధిలో నూటికి నూరు శాతం గిరిజనులు ఉండే 16 గిరిజన గ్రామాలను షెడ్యూల్ ఏరియాలో చేర్చాలని అసెంబ్లీ స్పీకర్ ద్వారా సీఎం వైయస్ జగన్‌ను కోరడం జరిగిందన్నారు. పార్వతీపురం నియోజకవర్గంలోని బలిజిపేట మండలం పరిధిలో ఇటీవల కురిసిన అకాల వర్షాల మూలంగా మొక్కజొన్న పంట మొత్తం పాడైపోయిందని, అధికారులచే పరిశీలన చేయించి రైతులను ఆదుకోవాలని సభ ద్వారా వ్యవసాయ శాఖ మంత్రిని కోరడం జరిగిందన్నారు. ఈ శాసనసభ సమావేశాల్లో తనకు మూడుసార్లు సభలో మాట్లాడే అవకాశం కల్పించిన సభా అధ్యక్షులకు ధన్యవాదాలు తెలియజేశారు.

## జంతువుల పట్ల క్రూరత్వాన్ని ప్రదర్శించవద్దు

విశాలాంధ్ర-పాలకొండ: జంతువుల పట్ల క్రూరత్వాన్ని ప్రదర్శించవద్దని సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ అన్నారు. జంతువుల పట్ల క్రూరత్వ నిరోధక చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని, జంతువులపై క్రూరత్వ నివారణ కమిటీని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. సబ్ కలెక్టర్ అధ్యక్షుతన పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జంతువుల పట్ల క్రూరత్వ నివారణ పై శుక్రవారం పాలకొండ రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ మాట్లాడుతూ 1960 చట్టం ప్రకారం జంతువులను అక్రమ రవాణా చేయడం చట్టవిరుద్ధమని తెలిపారు. మండలవారీగా యస్ పి సి ఏ కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. జంతువులను చట్టవిరుద్ధం రవాణా చేయకూడదని, జంతువుల జనన రేట్ వివరాలు నమోదు చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ జంతువుల పట్ల స్నేహ భావం, మానవత్వం కలిగి ఉండాలని, జంతువులకు ఎలాంటి హాని కలిగించవద్దని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యాక్రమంలో ఉప అధ్యక్షులు సబ్ డివిజనల్ పోలీసు అధికారి జి. వి. కృష్ణారావు, కార్యదర్శి పశుసంరక్షణ అసిస్టెంట్ డైరెక్టర్ పి.మాణిక్యరావు, అదనపు కార్యదర్శి వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ బి. సిద్ధార్థ, కమిటీ సభ్యులు, మున్సిపల్ కమీషనర్ యస్. సర్వేశ్వర రావు, పాలకొండ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ కె.మురళీధర రావు, డి.ఎల్.పి.ఓ జె. రామ ప్రసాదరావు, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఏ.లావణ్య, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కె. కిరణ్ చంద్ర , దేవాలయ శాఖ ఇన్‌స్పెక్టర్ యస్.రామారావు తదితరులు పాల్గొన్నారు.

# సచివాలయంలో అన్నీ సమస్యలే..!

విశాలాంధ్ర - వేపాడ: ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన సచివాలయం కూడా సమస్యలు ఎదుర్కొంటే అక్కడి ప్రజల సమస్యలను ఎవరు పరిష్కరిస్తారు. ప్రభుత్వం ఏ లక్ష్యంతో సచివాలయం వ్యవస్థను తీసుకు వచ్చిందో ఆ లక్ష్యంను నెరవేర్చాల్సిన అధికారులే నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల కంచె చేను మేసిన చందంగా ఉంది. వివరాల్లోకి వెలితే మండలంలోని కొండగంగుబూడి గిరిజన పంచాయతీలో ఏర్పాటు చేసిన సచివాలయంలో అన్నీ సమస్యలేనని చెప్పకతప్పదు. ప్రస్తుతం అక్కడి పాత పంచాయతీ భవనంలో

- సిబ్బంది లేమితో ప్రజలు సతమతం
- అంతర్జాలం సౌకర్యం లేక సక్రమంగా అందని సేవలు

నడుస్తున్న సచివాలయానికి కొత్తభవనం నిర్మించేందుకు కేటాయించిన స్థలం కోర్టు కేసులో చిక్కుకోగా భవన నిర్మాణం నిలిచిపోయిన సంగతి తెలిసిందే. అలాగే పంచాయతీలో ఏ అంతర్జాలంకి సంబంధించి టవర్ లేకపోవడంతో ప్రజలకు సక్రమంగా సేవలందించడానికి సిబ్బంది పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. కార్యాలయంలో నెట్‌వర్క్ సేవలు అరకొరగా అందడం వల్ల కార్యాలయం వెలుపలి ప్రాంతంలో ఎక్కడ అంతర్జాలం అందుబాటులోకి వస్తే అక్కడకు లబ్దిదారులను వెంటబెట్టుకొని వెళ్ళాల్సిన పరిస్థితి నెలకొంది. ఇదిలా ఉండగా పంచాయతీ కార్యదర్శి, వెల్ఫేర్ అసిస్టెంట్‌లు మెడికల్ లీవ్‌లో ఉండగా సచివాలయ సర్వేయర్ డెప్యూటేషన్‌పై వెళ్లగా మహిళా పోలీస్ ఉద్యోగానికి రాజీనామా చేయడంతో అది కూడా ఖాళీగా ఉంది. అలాగే పశు వైద్య అసిస్టెంట్ పోస్టు నేటికీ భర్తీ చేయకపోవడంతో పశు వైద్య సేవలు కూడా సక్రమంగా అందడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఇక్కడి సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్, ఇంజనీరింగ్ అసిస్టెంట్, జూనియర్ లైన్ మెన్, ఏఎన్ ఎమ్, వీఆర్వోలు మాత్రమే విధులు నిర్వహిస్తున్నప్పటికీ కొన్ని శాఖల సేవలు మాత్రమే అరకొరగా అందుతున్నాయి.

గిరిజన గ్రామ పంచాయతీ అయిన కేజీ పూడిలో సచివాలయం ఉన్నా సక్రమంగా సేవలు అందకపోవడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో పంచాయతికి చెందిన సిపిఎం నేత చల్లా జగన్ నేతృత్వంలో అంతర్జాల టవర్ కోసం ఆందోళన చేయగా అప్పటి ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి చొరవతో ఆన్లైన్లో ఇవ్వాల్సిన కోటా సరుకులను ఇపుడు ఆఫ్‌లైన్లో ఇస్తున్నారు. కానీ నేటికీ నెట్‌వర్క్ టవర్ వేసిన దాఖలాలు లేవు. ప్రస్తుత పాలకులైనా స్పందించి ఏదో అంతర్జాల టవర్ వేసి సచివాలయ సిబ్బంది కొరతను నివారించి ప్రజలకు సక్రమంగా సేవలందించేలా చర్యలు తీసుకొని సచివాలయ వ్యవస్థ లక్ష్యాన్ని అమలు జరిగేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

## ఇద్దరు వైద్యాధికారులు నియామకం

విశాలాంధ్ర - వంగర: మండలంలో గల అరసాడ నూతన ప్రాథమికారోగ్య కేంద్రానికి ఇరువురు వైద్యాధికారులను నియమించినట్లు హాస్పటల్ డెవలప్‌మెంట్ కమిటీ ఛైర్మన్, ఎంపీపీ సురేష్ ముఖర్జీ తెలిపారు. శుక్రవారం వంగర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన హాస్పటల్ అభివృద్ధి కమిటీ సమావేశంలో మాట్లాడారు. కలమట ఈశ్వర రావు, బెల్లంకొండ సౌమ్యలను నియమించారని అన్నారు. ఎట్టకేలకు ఇద్దరు డాక్టర్లను నియమించడంతో ప్రజలకు పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందనున్నాయన్నారు. వంగర హాస్పటల్‌లో నాడు-నేడు కిందను 12 లక్షల రూపాయలతో వివిధ అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, మార్చి నెలాఖరు నాటికి పనులు పూర్తికానున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటీసీ ప్రతినిధి కరణం సుదర్శనరావు, ఎంపిడివో వి.శ్రీనివాసరావు, తహశీల్దార్ ఐజాక్, డాక్టర్లు సి హెచ్ జ్యోతి,సుస్మితాదాయానా,సి హెచ్ వో రామారావు పాల్గొన్నారు.

## సమగ్ర భూ సర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - నెల్లిమర్ల: సమగ్ర భూ సర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ పతివాడ అప్పన్న అన్నారు. నెల్లిమర్ల మండలం కొండగుంపాంలో శుక్రవారం రీ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి రీ సర్వేతో రైతులకు హక్కు లభిస్తోందని చెప్పారు. రైతులు వన్ బి, గ్రామపురోణి, రిజిస్టర్ డాక్యుమెంట్లు సిబ్బందికి అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు మొయిద రాంబాబు, నాయకులు రెడ్డి సన్యాసినాయుడు, వాళ్లె నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి పనుల పరిశీలన

విశాలాంధ్ర - గజపతినగరం: మండలంలోని దావాలిపేట పురిటిపెంట గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనులను ఏపీవో సిహెచ్ రామారావు శుక్రవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేతనదారులు గిట్టుబాటు ధర లభించేలా పనులు చేసుకోవాలని సూచించారు. అనంతరం వేతనదారుల మస్టర్లను పరిశీలించారు.

## వాహనాల వేలం

విశాలాంధ్ర - గజపతినగరం: గజపతినగరం సర్కిల్ పరిధిలో గల గజపతినగరం బూర్జి వలస, మానాపురం, ఆంధ్ర బండపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో గల ఎక్సైజ్ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలకు ఈనెల 31న వేలం వేయబడుతుందని గజపతినగరం సర్కిల్ ఇన్స్పెక్టర్ అప్పలనాయుడు ఒక ప్రకటనలో విలేకరులకు తెలియజేశారు. పలు స్టేషన్‌లలో గల 11 వాహనాలకు వేలం వేయనున్నట్టు తెలిపారు.

## ఆటో డ్రైవర్‌లతో సమావేశం

విశాలాంధ్ర - గజపతినగరం: గజపతినగరం పోలీస్ స్టేషన్ పరిధిలో గల ఆటో డ్రైవర్లతో ఎస్ఐసిహెచ్ గంగరాజు శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలని, అలాగే రోడ్డు పక్కన పార్కింగ్ చేయరాదని, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించ రాదని కోరారు. వీటి వలన ప్రమాదాలు ఎక్కువగా జరుగుతు న్నాయని అన్నారు. ఈ సమావేశంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## భూ సర్వే పనుల పరిశీలన

విశాలాంధ్ర - తెర్లాం: 'వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు భూ రక్ష పథకం' లో భాగంగా మండలంలోని విజయరాంపురం ఏబూరిపేట గ్రామ రెవెన్యూ గ్రామ పరిధిలో జరుగుతున్న పనులను తహశీల్దార్ రాజేశ్వరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే టీము తప్పకుండా రైతుల సమక్షంలోనే వారి వారి పొలాలను కొలతలు తీసుకోవాలని, అప్పగించిన పనిని ప్రభుత్వ నిబంధన మేరకు వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ ఎం.వెంకటరమణ, గ్రామ సర్పంచ్ అయినబూరి మధుసూదనరావు, గ్రామ రెవెన్యూ అధికారి రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ కోదండ రామాలయ విగ్రహ ప్రతిష్ఠ

విశాలాంధ్ర - శృంగవరపుకోట: శృంగవరపుకోట మండలం గవరపాలెం గ్రామంలోని ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు శ్రీ కోదండ రామాలయ విగ్రహ ప్రతిష్ట మహోత్సవము అంగరంగ వైభవంగా శుక్రవారం జరిగింది. శృంగవరపుకోట మాజీ ఎమ్మెల్యే కోళ్ళ లలిత కుమారి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు జీఎస్ నాయుడు, క్లస్టర్ కోఆర్డినేటర్ ఇందుకూరు శ్రీను రాజు, టిడిపి సీనియర్ నాయకుడు అల్లూరి సత్తిబాబు రాజు, తూర్పాటి ఆదిబాబు, ఆదారి సూరప్పారావు, బీశెట్టి అరుణ, గవరపాలెం గ్రామ పెద్దలు, కార్యకర్తలు, యువత, మహిళలు పాల్గొన్నారు.

## డా. భాగ్యరేఖకు ఉత్తమ వైద్యాధికారిణి అవార్డు

విశాలాంధ్ర - జామి: విధి నిర్వహణలో ఎప్పుడూ అత్యుత్తమ ప్రతిభ కనబరిచే జామి పీహెచ్‌సీ వైద్యాధికారిణి డా. భాగ్యరేఖకు జిల్లా అధికారులు ఉత్తమ వైద్యాధికారిణిగా అవార్డును బహుకరించారు. జిల్లా క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని వైద్య, ఆరోగ్య శాఖ ప్రధాన కార్యాలయంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డా. వి. ఎస్. ప్రసాద్,. డీటీసీఓ డా. రామేశ్వరి తదితరుల చేతుల మీదుగా శుక్రవారం భాగ్యరేఖకు అవార్డును ప్రధానం చేశారు. ఎస్.కోట టిబి యూనిట్ ప్రత్యేక అధికారిగా ఆమె చేసిన సేవలకు గాను ఈ గుర్తింపు లభించింది. తనకు ఈ అవార్డు రావడం పట్ల మరింత బాధ్యతను పెంచిందని డా. భాగ్యరేఖ తెలిపారు.

## పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

విశాలాంధ్ర - శృంగవరపుకోట : పదవ తరగతిలో ఇష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని టీడీపీ యువనేత గొంప కృష్ణ సూచించారు. శుక్రవారం శృంగవరపుకోట మండలం, కొట్టాం గ్రామంలో జిల్లా పరిషత్ హైస్కూల్లో చదువుతున్న 45 మంది విద్యార్థులకు పబ్లిక్ ఎగ్జామ్స్ కొరకు పరీక్ష రాసే ప్యాడ్‌లు, పెన్నులు, ఇతర స్టేషనరీ మెటీరియల్‌ను విద్యార్థులకు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో శృంగవ రపుకోట నియోజకవర్గ యువనేత గొంప కృష్ణ, రాయవరపు చంద్ర శేఖర్ (విశాఖ పార్లమెంట్ ఉపాధ్యక్షులు), లెంక శ్రీను (విశాఖ తెలుగు యువత పార్లమెంట్ ఉపాధ్యక్షులు), జుత్తాడ రామసత్యం (యస్.కోట పార్టీ కార్యదర్శి), మంగరాజు తదితరులు పాల్గొన్నారు.

## అత్యాచార బాధితులకు న్యాయం జరగాలి

### కలెక్టర్ ఎ.సూర్యకుమారి

విశాలాంధ్ర - విజయనగరం: ఎస్‌సి, ఎస్‌టి అత్యాచార బాధితులకు న్యాయం జరగాలని జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి స్పష్టం చేశారు. అట్రాసిటీ చట్టం క్రింద నమోదు చేసిన కేసుల్లో విచారణ వేగవంతం చేయాలని ఆదేశించారు. జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో, విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సమావేశం కలెక్టరేట్ ఆడిటోరియంలో శుక్రవారం జరిగింది. గత ఏడాది ఆగస్టు నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి నెలాఖరు వరకు నమోదైన ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులపై, గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలుపై చర్చించారు. కలెక్టర్ సూర్యకుమారి మాట్లాడుతూ అట్రాసిటీ కేసుల్లో విచారణ త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. బాధితులకు తక్షణ పరిహారాన్ని అందించాలని చెప్పారు. కేసుల్లో బాధితులకు బెదిరింపులు వస్తే, పోలీసులు కఠినంగా వ్యవహరించాలని సూచించారు. జాతాపు తెగకు చెందిన కేసుల్లో, బాధితుల బాధ తెలుసుకొనేందుకు, బాషా అనువాదకులను నియమించి, కోర్టుకు పంపించాలని సూచించారు. కేసులు నమోదుకు అవసరమైన మెడికల్ సర్టిఫికేట్లను త్వరగా మంజూరు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ పి.రత్నం, అధికారులు, డిఎస్‌పిలు, తహశీల్దార్లు, విజిలెన్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## పిల్లలు, గర్భిణీల ఆధార్ నమోదుకు ప్రత్యేక డ్రైవ్

విశాలాంధ్ర - పార్వతీపురం: జిల్లాలో పిల్లలు, గర్భిణీల ఆధార్ అప్‌డేట్ చేయుటకు వారం రోజులపాటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశించారు. పార్వతీపురం మండలంలోని నర్సిపురం సచివాలయాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. బెనిఫిషియరి అవుట్ రీచ్ ప్రోగ్రాం (బి.ఓ.పి) యాప్, వై.యస్.ఆర్ సంపూర్ణ పోషణ (వై.యస్.ఆర్) యాప్‌లలో డేటా అప్‌డేట్‌ను పరిశీలించారు. ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు ఆధార్ నమోదుతోపాటు, గర్భిణీలకు ఆధార్ అప్ డేట్, ఆర్.సి.హెచ్ ఐడి జారీ ప్రక్రియ విధిగా జరగాలని ఆయన స్పష్టం చేశారు. ఈ నెల 27,28,29 తేదీల్లో ఆధార్ అప్‌డేట్ చేయుటకు ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి కె.విజయ గౌరి, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ, ఐసిడిఎస్ పిఓలు, ఏ.ఎన్.ఎంలు, అంగన్వాడీ కార్యకర్తలు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## చంద్రబాబు ప్రణాళికతోనే విజయం

### మాజీ మంత్రి శత్రుచర్ల

విశాలాంధ్ర - బెలగాం: టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ప్రణాళికతోనే విజయం వరించిందని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ, టీడీపీ సీనియర్ నాయకులు శత్రుచర్ల విజయరామరాజు అన్నారు. టీడీపీ అభ్యర్థిని పంచుమర్తి అనురాధ ఎమ్మెల్సీగా విజయం సాధించడంతో శత్రుచర్ల కోటలో శుక్రవారం సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా విజయరామరాజు మాట్లాడుతూ ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏడు స్థానాలు కైవసం చేసుకోవడానికి కలలు కన్న ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి సొంత పార్టీ ఎమ్మెల్యేల విశ్వాసాన్ని కూడా కోల్పోయారని అన్నారు. కురుపాం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి తోయక జగదీశ్వరి మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టబద్రుల ఉద్యోగులు ఇప్పుడు సొంత పార్టీ ఎమ్మెల్యేలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విధానాలను వ్యతిరేకించారని, జగన్మోహన్ రెడ్డి ఇప్పటికైనా వాస్తవాలను గుర్తించి ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలన్నారు. అనంతరం కురుపాం కోటలో కేంద్ర మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నాయకులు వైరిచర్ల కిషోర్ చంద్ర సూర్యనారాయణ దేవ్ సమక్షంలో ఎమ్మెల్సీగా పంచుమర్తి అనురాధ విజయం సాధించడం పట్ల నియోజకవర్గ ఇంచార్జీ తోయక జగదీశ్వరి కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

## క్షయ మహమ్మారి పట్ల జాగ్రత్త వహించాలి

విశాలాంధ్ర - బెలగాం : క్షయ (టిబి) మహమ్మారి పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని జాయింట్ కలెక్టర్ ఓ.ఆనంద్ అన్నారు. శుక్రవారం ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయం మీదుగా స్థానిక ఎన్జీఓ హోం వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్జీఓ హోంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జెసి ఆనంద్ మాట్లాడుతూ క్షయ అనేది గాలి ద్వారా వ్యాపించే ఒక అంటువ్యాధని, కోవిడ్‌తో పాటూ క్షయ రోగం కూడా ఇబ్బంది కలిగించే సమస్య అని, ప్రస్తుతం దేశంలో కోవిడ్ కోవిడ్ కేసులు పెరుగుతున్నాయని, వాటితో పాటూ క్షయ కేసులు ఇంకా ఉన్నాయని పేర్కొన్నారు. 2025 నాటికి టిబిని పూర్తిగా అంతం చేయాలని ఆరోగ్యశాఖ లక్ష్యంగా పెట్టుకుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యశాఖాధికారి డా. బగాది జగన్నాధరావు, జిల్లా క్షయ వ్యాధి నివారణాధికారి డా. ఎ.శ్యామ్ కుమార్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులు డా. యాళ్ల వివేక్, డా. శేషగిరిరావు, ఛాతి వైద్యులు డా. దుర్గా ప్రసాద్, ధవళ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

వేపాడ: మండల కేంద్రం వేపాడ పీహెచ్సీలో వైద్యాధికారి ఏ.ధరణి సారధ్యంలో శుక్రవారం ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం నిర్వహించారు. అనంతరం వైద్య సిబ్బందితో క్షయ వ్యాధి నివారణకు టీబీ ఓడిపోతుంది -దేశం గెలుస్తుంది,అందరికీ చుక్కలు, మనందరి పంతం- టీబీ అంతం అనే నినాదాలు చేస్తూ గ్రామ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. నేటి నుండి 21రోజులపాటు ప్రతి సచివాలయంలో క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని వైద్యాధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ ఆంజనేయులు,హెల్త్ సూపర్వైజర్ రమణ, ఏఎన్ఎం లు, ఎమ్.ఎల్ .హెచ్.పీ లు తదితర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## విశ్రాంతి భవనాలను (షెడ్) జిల్లా అంతటా నిర్మించాలి

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: విశ్రాంత భవనాలను జిల్లా అంతటా నిర్మించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు గదుల వెంకట్రావు డిమాండ్ చేశారు. శుక్రవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గదుల వెంకటరావు మాట్లాడుతూ జిల్లాలో విశ్రాంతిభవనాలు (షెడ్ లు) లేక ప్రజలు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఆర్టీసీలో ప్రయాణం చేస్తున్న ప్రయాణికులు, టూ వీలర్ మీద ప్రయాణం చేస్తున్న ప్రయాణికులు పాదచారులు విశ్రాంతి భవనాలు లేక అనేక ఇబ్బందులకు గురి అవుతున్నారన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, వాహనాలు రాక కోసం ఎదురుచూస్తున్నారని తెలియజేశారు. గంటల కొలది వాహనాల కోసం ఎదురు చూడటం వల్ల ప్రయాణికులు ఒక్కొక్కసారి స్పృహ తప్పి పడిపోవడం జరుగుతుందని అన్నారు. దారి, నీడ, రోడ్డు, సౌకర్యాలు కల్పించవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చోడి ఆదినారాయణ, యువత నాయకులు పట్నాల వెంకటేశు, గొల్ల గాన బంగారు రాజు, దువ్వు అప్పా రావు, మొదలగు జిల్లా నాయకులు పాల్గొన్నారు.

## మోదీ విధానాలు తిప్పి కొట్టాలి

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: సామ్రాజ్య వాదానికి, కార్పొరేట్ శక్తులకు వూడిగం చేసే మోడి ప్రభుత్వం విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతామని, అలాగే మతోన్మాధం, ప్రపంచీకరణ విధానాలకి వ్యతిరేకంగా దేశానికి, రాజ్యాంగానికి, ప్రజలకు ప్రమాదంగా మారిన మోడి విధానాలను త్రిప్పి కొడతామని సీపీఎం పార్టీ సభ్యులు ప్రతిజ్ఞా చేశారు. శుక్రవారం ఎల్ బి జి నగర్లో జరిగిన ప్రతిజ్ఞా కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పి.రమణమ్మ మాట్లాడుతూ అంబానీ, అదాని లాంటి కార్పొరేట్ శక్తులకు అండగా నిలిచిన మోడి ప్రభుత్వం ప్రజలపై భారాలు మోపుతుందని అన్నారు. బి.రమణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముందుగా భగత్ సింగ్ ఫోటోకి రమణమ్మ పూల మాల వేశారు.

## ఎట్టకేలకు కన్నెంగెడ్డ పూడికతీత

విశాలాంధ్ర - శృంగవరపుకోట: కన్నెంగెడ్డ పూడికతీత పనులు ఎట్టకేలకు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఎస్.కోట దేవి జంక్షన్ సమీపంలో ఉన్న (విశాఖ - అరకు రహదారి పక్కన) కన్నెంగెడ్డలో పూడికతీత పనులను సర్పంచ్ గనివాడ సంతోషి కుమారి, ఉప సర్పంచ్ మోపాడ కుమార్, ఈఓ పాత్రో, వార్డు మెంబర్ మజ్జి శేఖర్, శానిటరీ మేస్త్రి నానిగిరి కృష్ణ తదితరులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సంతోషికుమారి మాట్లాడుతూ పట్టణంలో ఎక్కడైనా పారిశుద్ధ్య సమస్యలు తలెత్తితే పంచాయతీ ప్రజా ప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు.

## పెరటి కోళ్లు పంపిణీ

విశాలాంధ్ర - మెంటాడ: స్థానిక వెలుగు కార్యాలయం ఆవరణలో శుక్రవారం వెలుగు ఏపీఎం దేముడు బాబు అధ్యక్షతన డ్వాక్రా మహిళలకు 30 యూనిట్లు పెరటి కోళ్లను అందజేశారు. ఒక యూని ట్‌కు 11 కోడి పిల్లలను, 8 పెట్టలను, 03 పుంజులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు మాట్లాడుతూ మండల సమాఖ్య పరిధిలో 30 యూనిట్లు మంజూరు జరిగాయి అని, 50 శాతం రాయితీపై లబ్ధిదారులకు అందచేయడం జరి గిందని అన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం దేము డు బాబు, వైస్ ఎంపీపీలు సారిక ఈశ్వరరావు, జడ్పిటిసి ప్రతినిధి లెంక రత్నాకర్ నాయుడు, పి.అచ్యుతరావు, సిసిలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## రూ.5.76 లక్షలకు రోజువారి మార్కెట్ వేలం ఖరారు

విశాలాంధ్ర - జామి: 2023 -24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి స్థానిక మేజర్ పంచాయతీ జామిలో కూరగాయల మార్కెట్ ఆసీలు వసూళ్లకు శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించారు. మండల పంచాయతీ విస్తరణ అధికారి వై.లక్ష్మి ఆధ్వర్యంలో స్థానిక సర్పంచ్ సిహెచ్ లక్ష్మి, ఉప సర్పంచ్ అల్లు పద్మ, పంచాయతీ కార్యదర్శి ఎం.శ్రీదేవి సమక్షంలో వేలంలో నిర్వహించారు. ఈ వేలం లో మొత్తం 42 మంది పాటదారులు పాల్గొన్నారు. వీరిలో బొబ్బిలి రాజు యాదవ్ అనే వ్యక్తి రోజువారి ఆశీలు, వారపు సంత ఆశీలును సొంతం చేసుకున్నాడు. రోజువారి ఆశీలు వసూలుకు రూ.4.95 లక్షలు ఖరారు కాగా, వారపు సంతకు రూ. 81,000 ఖరారు అయింది. మొత్తం 5.76 లక్షలకు ఆశీలు వసూళ్ల వేలం ఖరారు అయినట్లు ఈవో పంచాయతీ కార్యదర్శి ఎం శ్రీదేవి వివరించారు.

## స్వమిత్వ సర్వేను పరిశీలించిన ఈఓపీఆర్డీ

విశాలాంధ్ర - సీతానగరం: మండలంలోని బగ్గందొరవలస గ్రామ పంచాయతీలో జరుగుతున్న స్వమిత్వ సర్వేను మండల పంచాయతీ విస్తరణాధికారి వర్మ శుక్రవారం సందర్శించి పరిశీలించారు. గ్రామ పంచాయతీలోని గ్రామకంఠం ఖాళీ స్థలాలు, నిర్మాణాలను సర్వే సిబ్బంది సర్వే నిర్వహించి నమోదు చేయాలని కోరారు. అన్ని గ్రామాల్లోని స్వమిత్వ సర్వే ద్వారా వివరాలు నమోదు జరుగుతుందని తెలిపారు. ఇదిలా వుండగా అన్ని గ్రామ పంచాయతీల కార్యదర్శులు ఇంటి పన్నులు వసూలు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నారాయణరావు, సెక్రటరీ శ్రీనివాసరావు, సచివాలయం సిబ్బంది, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

## గిరిజన గ్రామాలకు సౌర విద్యుత్

విశాలాంధ్ర - బొబ్బిలి: మండలం చిన్న అక్కేన వలస, మారు మూల గిరిజన గ్రామానికి విద్యుత్ సౌకర్యం లేకపోవడాన్ని బొబ్బిలి ఫ్రెండ్ సర్కిల్ యూత్ తెలుసుకొని అక్కడ నివసిస్తున్న గిరిజన కుటుంబాలకు 11 ఇళ్లకు 4 వీధి దీపాలను సోలార్ విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేశారు. దీనికి బొబ్బిలి ఫ్రెండ్స్ సర్కిల్ యూత్ సుమారు 30 వేల రూపాయలు తమ సొంత నిధులతో గిరిజనులకు సమకూర్చినట్లు బొబ్బిలి ఫ్రెండ్స్ సర్కిల్ యూత్ సభ్యులు పితాని శ్రీను, ప్రశాంత్, కుమార్, నరసింహమూర్తి, సందీప్, నాగార్జున, సంతోష్ ,నాయుడు, మురళి,రమేష్, మని, తెలిపారు. వారికి గిరిజనులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## ద్విచక్ర వాహనానికి వేలం

విశాలాంధ్ర - తెర్లాం/బాడంగి: బాడంగి మండలం రామభద్రపురం పోలీస్ స్టేషన్ పరిధిలో విజయనగరం జిల్లా ఎస్పీ జారీ చేసిన ఉత్తర్వుల మేరకు విజయనగరం అస్టెంట్ ఎన్ఫోర్స్మెంట్ సూపరింటెండెంట్‌ల ఆధ్వర్యంలో హీరో గ్లామర్ మోటార్ సైకిల్ బీయరింగ్ నెం: AP 35 AG 3157 గల దానికి ఆక్షన్/వేలం నిర్వహిస్తున్నట్టు ఎస్ఐ ఆర్.జయంతి తెలిపారు. మోటార్ సైకిల్‌కు నిర్ణయించిన ఖరీదు 40,000/గా పేర్కొన్నారు. కావున ఆసక్తి గలవారు వేలంపాటలో పాల్గొని పాడుకోవాలని తెలిపారు.

## కోటయ్య గరువు గ్రామంలో వైద్య శిబిరం

విశాలాంధ్ర - వేపాడ: మండలంలోని కొండ గంగుపూడి పంచాయతీ శివారు, కోటయ్య గరువు,బడ్డీ చింతల గ్రామాల్లో గురువారం బొద్దాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సతీష్ కుమార్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు వైద్యాధికారి సతీష్ కుమార్ తెలిపారు. గ్రామంలో మలేరియా జ్వరాలు ప్రబలి నట్టు వచ్చిన సమాచారం మేరకు స్పందించి ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించినట్లు తెలిపారు.మొత్తం రెండు గ్రామాల్లోనూ 80 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి 8మంది జ్వర పీడితులను గుర్తించి వారికి ప్రత్యేక వైద్య సేవలు అందించడంతోపాటు మందులు అందజేశామన్నారు. అలాగే జ్వరపు పీడుతులకు రక్త నమూనాలు సేకరించామన్నారు. అలాగే ఆర్డిటి పరీక్షలు కూడా నిర్వహించినట్లు తెలిపారు. గ్రామాల్లో క్లోరినేషన్ చేయించడంతోపాటు ఎబిట్ మందును పిచికారీ చేయించినట్లు చెప్పారు.అనంతరం క్షయ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో హెల్త్, సూపర్వైజర్ పి ఎస్ ఆర్ మూర్తి,హెల్త్ అసిస్టెంట్,ఎమ్ ఎల్ హెచ్ పి, ఏఎన్ఎం, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొని రోగులకు సేవలు అందించారు.

## మూడు వారాల్లో గృహ నిర్మాణాలు పూర్తి కావాలి

విశాలాంధ్ర - పార్వతీపురం: జిల్లాలో మూడు వారాల్లో నిర్దేశిత గృహ నిర్మాణాలు పూర్తి కావాలని జిల్లా నిశాంత్ కుమార్ ఆదేశించారు. జిల్లాలో గృహ నిర్మాణాలపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ సమీక్షించి మాట్లాడారు. సంబంధిత అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. జిల్లాలో ఇప్పటికే 8,916 గృహాల నిర్మాణం పూర్తి అయ్యాయని, మిగిలిన గృహాలు పూర్తి కావడానికి బాధ్యత వహించాలని ఆయన పేర్కొన్నారు. ఆర్.సి స్థాయిలో ఉన్న గృహాలు, సొంత స్థలాల్లో నిర్మాణాలపై దృష్టి సారించాలని ఆయన అన్నారు. నిర్మాణాలు చేయుటకు రోజు వారి చేసే పనులు ముందుగా తయారు చేసి లబ్దిదారులను సమాయత్తం చేయాలని ఆయన సూచించారు. స్వయం సహాయక సంఘాల సభ్యులకు రుణాల మంజూరుకు చర్యలు తీసుకోవాలని డి.ఆర్.డి.ఏ, మెప్మా అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.రఘురాం, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.కిరణ్ కుమార్, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. రామచంద్రరావు, జిల్లా ఆర్.డబ్ల్యు.ఎస్ ఇంజినీరింగ్ అధికారి ఓ. ప్రభాకర రావు, గృహ నిర్మాణ సంస్థ కార్యనిర్వహణ ఇంజినీర్ రమేష్, మునిసిపల్ కమీషనర్లు జె.రామ అప్పల నాయుడు, హెచ్. శంకర రావు, ఎస్. సర్వేశ్వర రావు, ఇపిడిసిఎల్ ఇంజినీరింగ్ అధికారులు గోపాల కృష్ణ, కె.వి.రత్నం తదితరులు పాల్గొన్నారు.

# అనాథలను అక్కునచేర్చుకుంటున్న 'ఎయిమ్ ఫర్ సేవా క్షేత్రాలయం'

ఎంతోమంది అనాథ పిల్లలను ఆదుకున్న లచ్చయ్యపేట క్షేత్రాలయం

శ్రీశ్రీశ్రీ స్వామీ దయానందసరస్వతి ఆధ్వర్యంలో ఏర్పాటుకు

దాతల సహకారం మరువలేనిది

విశాలాంధ్ర-సీతానగరం: మన్యం జిల్లా సీతానగరం మండలంలోని లచ్చయ్యపేట ఎన్‌సిఎస్ చక్కెర కర్మాగార పరిధిలోని (ప్రస్తుతం ధాత్రి రియల్ ఎస్టేట్ సంస్థ పరిదిలో) ఏర్పాటు చేసిన 'ఎయిమ్ ఫర్ సేవా క్షేత్రాలయం' (శ్రీశ్రీశ్రీ స్వామీ దయానంద, సేవా ఆశ్రమం) ఎంతో మంది అనాథ పిల్లలను, పేద పిల్లలను చేరదీసి వారిని ఆదుకుంటున్న తీరును మెచ్చుకోవాలి. 2007లో ఇక్కడ ఎన్‌సీఎస్ చక్కెర కర్మాగార యాజమాన్యంకు చెందిన ఎన్.నాగేశ్వరరావు, ఎన్.శ్రీనివాస్‌లు ఇక్కడ కొంతస్థలాన్ని ఈ సంస్థకు దానం చేయగా, అమెరికాలో ఉంటున్న ఈ ప్రాంతవాసి డాక్టరు రౌతు సింహాచలం అనే ఆమె క్షేత్రాలయానికి పూర్తి భవనాలను నిర్మించి అందజేసారు. దీంతో ప్రధానమంత్రి మోదీ గురువయిన శ్రీశ్రీశ్రీ స్వామీ దయానంద సరస్వతి చేతుల మీదుగా ఇక్కడ క్షేత్రాలయాన్ని అప్పట్లో ఘనంగా ప్రారంభం చేశారు. దేశవ్యాప్తంగా ఉండే 129 సంస్థల వ్యవస్థాపకులు స్వామీజే కావడం విశేషం. ఆయన మరణానంతరం ఆంధ్రప్రదేశ్లో క్షేత్రాలయాలను శ్రీ స్వామీ స్థైర్యానంద సరస్వతి పర్యవేక్షణలో నడుస్తున్నాయి. ఈనెల 12న స్వామీజీ ఇక్కడకు రావడం, ఇక్కడ కార్య్ర కమాల పట్ల సంతృప్తి వ్యక్తం చేయడంతో క్షేత్రాలయ కమిటీ సభ్యులు ఆనందం చెందారు. ఆంధ్రప్రదేశ్లో 13 క్షేత్రాలయాలు ఏర్పాటుచేయగా ఉత్తరాంధ్రలో లచ్చయ్యపేటలోనే ఉండటం గమనార్హం. ఇక్కడచేరే పిల్లలకు ఉచిత విద్య, భోజనం, వసతి, వారుచదువుకునే పాఠశాలకు ఉచితంగా స్వంత బస్లో పంపించడం, క్రమ శిక్షణా చర్యలు పాటించేలా అలవాటు చేయడం, హిందూ సాంప్రదాయాన్ని అలవాటు చేయడం, వారు స్వశక్తిపై అదార పడేలా తీర్చదిద్దడం , యోగా, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడంద్వారా వారిని చైతన్యం చేసి వారిలో విజ్ఞానం పెంచడమే ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.

### దాతల సహకారం మరువలేనిది

లచ్చయ్యపేటలో గత 16ఏళ్లుగా నడుపుతున్న సేవాఆశ్రమంకు సంస్థ అందిస్తున్న చేయూతతోపాటు ఈప్రాంత దాతలు అందిస్తున్న సహకారానికి రుణపడి ఉంటామని క్షేత్రాలయ నిర్వహకులు చెప్పారు. బొబ్బిలి, సీతానగరం, పార్వతీపురం, మక్కువ, బలిజిపేట, విజయనగరం మండలాలతో పాటు దూర ప్రాంతాలకు చెందిన దాతలు ఎంతోమంది వారి పుట్టిన రోజులు, పెళ్ళిరోజులు ఇంకా ఎన్నిన్నో కార్యక్రమాలను ఇక్కడే అనాథ పిల్లల మధ్యలో జరుపుకోవడం, పిల్లలకు సహాయం అందించడంలో వారుచేస్తున్న సేవలు యెనలేనివని చెప్పారు. ఎక్కువగా బొబ్బిలి పట్టణ ప్రముఖులు, సీతానగర మండలవాసులు అందిస్తున్న సహకారానికి రుణపడి ఉంటామని చెప్పారు. పిల్లలు ప్రైవేటు పాఠశాలల్లో విద్యాబోధనకు అందిస్తున్న సహకారం మరువలేని దన్నారు. సాలూరుకు చెందిన సంస్థ వారు అప్పట్లో ఒక అంబులెన్సు అందజేయగా, చెన్నైకు చెందిన ఒకరు పిల్లల ట్రాన్స్ పోర్ట్ కోసం ఒకబస్సును అందజేసారు. బొబ్బిలి యువరాజా బేబీ నాయన ఇకపేడాదిపాటు పిల్లలందరి ఫీజులు చెల్లించటంతో పాటు ఎంతో సహాయాన్ని అందించడం మరువలేనిదన్నారు.బొబ్బిలికి చెందిన ఎస్విఎస్ఆర్ కృష్ణ పిల్లలకు, సంస్థ నిమిత్తం సోలార్ హాట్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయగా, ఇటీవల జనసేననేత బాబు పాలురు త్రాగునీరు సదుపాయాన్ని ఏర్పాటు చేశారని చెప్పారు. ఇక్కడ సంస్థ చేస్తున్న సేవలు గుర్తించి ఇటీవల ఈభూములను ప్రభుత్వమే ఆర్ ఆర్ యాక్టు ద్వారా వేలం పాట నిర్వహించి ధాత్రి రియల్ ఎస్టేట్ వారికి అమ్మినప్పటికీ క్షేత్రాలయంఉండే భూములు మాత్రం స్వాధీనం చేయకుండా సంస్థవారికే కేటాయించారు.

### అభివృద్ధి కమిటీ సేవలు అభినందనీయం

ఈక్షేత్రాలయానికీ ప్రారంభం నుండి నేటి వరకు కమిటీ సభ్యులుగా ఉండే కొత్తా రవి కుమార్, డాక్టరు కెవి అప్పారావు, పుల్లెల శ్రీనివాస్, సాలా అశోక్, గోనా ప్రసాద్, తంగుడు గురునాధరావు, పి. నాగమణి, జె.రమాదేవి, డాక్టరు రౌతు సింహాచలంలతోపాటు క్షేత్రాలయం ఇంచార్జి, హాస్టల్ మేనేజర్ నల్ల సురేష్ అందిస్తున్న సేవలు ఎనలేనివి. వారి ఆధ్వర్యాన అన్ని కార్యక్రమాలు చేస్తున్నారు.

### అడ్మిషన్లకు సంప్రదించండి: ఇంచార్జి నల్ల సురేష్

లచ్చయ్యపేటలోని శ్రీశ్రీశ్రీ దయానంద సేవా ఆశ్రమం (క్షేత్రాలయం)లో 2023-24 విద్యా సంవత్సరంలో అడ్మిషన్లకు అనాథ పిల్లలు, పేద పిల్లలు సంప్రదించాలని ఇంచార్జి, హాస్టల్ మేనేజర్ నల్ల సురేష్ కోరారు. ఒకటో తరగతి నుండి పదో తరగతి వరకు అడ్మిషన్లు చేస్తానని చెప్పారు. ఇంకా ఇంటర్ పిల్లలు ఉంటే గుడివాడ ఇతర ప్రాంతాల్లో ఉండే క్షేత్రాలయాల్లో చేర్పిస్తామని చెప్పారు.

## చలో ఢిల్లీని జయప్రదం చేయండి

విశాలాంధ్ర - బొబ్బిలి: స్కీమ్ వర్కర్లకు కనీస వేతనాలు అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఏప్రిల్ 5న జరగనున్న చలో ఢిల్లీని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ కోరారు. చలో ఢిల్లీ జయప్రదం చేయాలని కోరుతూ శుక్రవారం శ్రీవేణుగోపాల ఆలయ మండపంలో స్కీమ్ వర్కర్లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పలు రంగాల్లో పని చేస్తున్న అంగన్వాడీలు, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, ఆశ కార్యకర్తలు, ఆర్పీలతో ప్రభుత్వం వెట్టిచాకిరి చేపించుకుని కనీస వేతనాలు అమలు చేయడం లేదన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతున్న వేతనాలు పెంచకపోవడం అన్యాయమన్నారు. సమావేశంలో సిఐటీయు జిల్లా అధ్యక్షులు వి.శంకరరావు, అంగన్వాడీ ప్రాజెక్టు అధ్యక్షులు జె. కామేశ్వరి, ఎండిఎం యూనియన్ అధ్యక్షులు రామలక్ష్మి, ఆర్పీల సంఘం అధ్యక్షులు లత, ఆశ యూనియన్ అధ్యక్షులు శాంతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## అవగాహనతో క్షయ వ్యాధి నియంత్రణ

విశాలాంధ్ర - బొబ్బిలి: అవగాహనతో క్షయవ్యాది నియంత్రణ, నివారణ సాధ్యమేనని రోటరీ క్లబ్ అధ్యక్షులు, నారాయనప్పవలన పాఠశాల ప్రధానోపాధ్యాయులు జెసి రాజు అన్నారు. శుక్రవారం పాఠశాలలో ప్రపంచ క్షయ నివారణ దినాన్ని సైన్స్ ఉపాధ్యాయుడు ఎం.శ్రీనివాసరావు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ, విద్యార్థులకు క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి రాజు మాట్లాడుతూ ఇది బ్యాక్టీరియా ద్వారా వచ్చే వ్యాదని, మైక్రో బ్యాక్టీరియ ట్యూబర్ కొలసీస్ అనే బ్యాక్టీరియా ద్వారా సంక్రమిస్తున్నదని అన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత అవసరమని అన్నారు. ప్రధాన మంత్రి టిబి ముక్తిభారత్ కార్యక్రమంలో భాగంగా రోటరీ ఆధ్వర్యంలో 30 మంది టిబి వ్యాధిగ్రస్థులకు పోషకాహారాన్ని అందిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మురళి, రామచంద్రరావు, మహేష్‌లు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ అనూరాధ విజయం విజ్ఞుల తీర్పు

### మాజీ కేంద్ర మంత్రి కిషోర్ దేవ్

విశాలాంధ్ర - కురుపాం: ఎమ్మెల్యే కోటాలో పంచమర్తి అనూరాధ ఎమ్మెల్సీ ఎన్నికలలో గెలుపుపై మాజీ కేంద్ర మంత్రి కిషోర్ చంద్ర దేవ్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన నివాసంలో నియోజకవర్గ ఇన్‌చార్జి తోయక జగదీశ్వరి, కార్యకర్తలు ఏర్పాటు చేసిన సంబరాలలో పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్ట భద్రులు విజ్ఞతతో ఓటు వేశారని ఈ గెలుపు మార్పునకు పిలుపు అని, రాబోవు కాలంలో రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం ఏర్పాటుకు ముందస్తు సంకేతమని తెలిపారు. రాబోవు కాలంలో కార్యకర్తలు ఐకమత్యంగా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. ఎమ్మెల్సీ పంచమర్తి అనూరాధ విజయం జాతీయ పార్టీ అధ్యక్షుడు ప్రణాళిక బద్దంగా వ్యూహంతో సాధ్య మైందని ఎమ్మెల్సీ, మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు అన్నారు.

## ఆరెంజ్ రీ రిలీజ్‌ను విజయవంతం చేయండి

### జనసేన నాయకులు గురాన అయ్యలు

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: తెలుగువారి ఖ్యాతి ప్రపంచ నలుదిశలా చాటిచెప్పి, ఆస్కార్ అవార్డు సొంతం చేసుకున్న 'ఆర్ఆర్ఆర్' చిత్ర కథానాయకుడు, మెగా పవర్‌స్టార్ రామ్‌చరణ్ జన్మదినోత్సవ వేడుకల్లో భాగంగా ఈనెల 25, 26 తేదీల్లో క్లాసిక్ ప్రేమ కథా చిత్రం ఆరెంజ్‌ని రీరిలీజ్ చేస్తున్నారని జనసేన నాయకులు గురాన అయ్యలు ఒక ప్రకటనలో తెలిపారు. ఆరెంజ్ రీరిలీజ్‌ని ఉమ్మడి విజయనగరం జిల్లాలోని పలు థియేటర్లలో ప్రదర్శించడం జరుగుతుందన్నారు. ఆరెంజ్ రీరిలీజ్‌ను జనసేన పార్టీ శ్రేణులు, మెగా అభిమానులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆరెంజ్ రీరిలీజ్ ద్వారా వచ్చే ప్రతీ రూపాయిని జనసేన పార్టీకి విరాళంగా ఇస్తామని చిత్ర నిర్మాత నాగబాబు ప్రకటించారన్నారు. ఈ ప్రకటనతో జనసేన పార్టీ శ్రేణులు, మెగా అభిమానులు కృషీ అవుతున్నారన్నారు. అలాగే ఈనెల 27వ తేదీన రామ్‌చరణ్ పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఆరోజు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించాలని పార్టీ శ్రేణులకు, మెగా అభిమానులకు పిలుపునిచ్చారు.

## సచివాలయాల పనితీరుపై ఆగ్రహం

విశాలాంధ్ర-పాలకొండ: మండలంలోని బెజ్జి గ్రామంలో ఉన్న సచివాలయం తీరుపై డివిజనల్ లెవెల్ డెవలప్మెంట్ అధికారి వి.వి. గోపాలకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం సచివాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేయగా పంచాయతీ సెక్రటరీ, డిజిటల్ కార్యదర్శి, పశుసంవర్ధక శాఖ కార్యదర్శితో పాటు మరో కార్యదర్శి విధుల్లో ఉన్నారు. మిగిలిన వారంతా ఎక్కడున్నారని ప్రశ్నించగా ఇతరత్రా పనుల్లో ఉన్నారని సిబ్బంది చెప్పడంతో ఆయన అసహనం చెందారు. బాధ్యతగా విధులకు హాజరు కాకపోతే ఎలా అంటూ ప్రశ్నించారు. సచివాలయం ద్వారా ప్రజలకు సక్రమంగా సేవలు కూడా అందడం లేదని గుర్తించి మండిపడ్డారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని చెప్పారు. అలాగే పట్టణంలో కోటదుర్గ సచివాలయాన్ని సందర్శించి అక్కడ హాజరు పట్టిని, మూమెంట్ రిజిస్టర్ ను పరిశీలించారు. సిబ్బంది పనితీరు పట్ల సంతృప్తి చెందారు. సచివాలయ సేవలు మరింత మెరుగుపడాలని సూచించారు.

## ఎండీయూ ఆపరేటర్ల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - శృంగవరపుకోట: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎండియు ఆపరేటర్స్ రేషన్ పంపిణీ వాహనదారుల సమస్యలు పరిష్కరించాలని ఎండియు ఆపరేటర్ల రేషన్ వాహనదారుల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతల వెంకటరమణ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం పట్టణంలోని తహసిల్దార్ కార్యాలయం వద్ద ఆపరేటర్లు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసిల్దార్ శ్రీనివాసరావుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చింతల వెంకటరావు మాట్లాడుతూ ఎండియు వాహనాలకు సంబంధించిన ఇన్స్యూరెన్స్ అమౌంట్ గవర్నమెంట్ కడుతుందని చెప్పినప్పటికీ బ్యాంక్ ఆఫ్ బరోడా వారు తన ఇష్టానుసారంగా ప్రతి ఒక్క ఎండియు ఆపరేటర్ కి సుమారు 18 వేల రూపాయల నుండి రూ.23,000 వరకు మైనస్లో పెట్టి జీతం పడిన వెంటనే ఆ అమౌంట్ను కట్ చేయడం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఆ డబ్బులు ఆపరేటర్ల ఖాతాలో జమ చేయాలని, రాష్ట్రవ్యాప్తంగా ఎండియూ ఆపరేటర్స్ విధులు నిర్వహిస్తుండగా గుండెపోటుతో, అనారోగ్యంతో సుమారు 57 మంది చనిపోవడం జరిగింది వారికి తక్షణమే ప్రభుత్వం బీమా సదుపాయం కల్పించి వారి కుటుంబ సభ్యులను ఆదుకోవాలని ఎండియు ఆపరేటర్స్ అందరికీ ప్రమాద బీమా కల్పించాలని అన్నారు. హమాలిలకు, వెహికల్ పెట్రోల్ కు, హెల్పర్ జీతం ఇవ్వలేని పరిస్థితుల్లో ఉన్నామన్నారు. సంబంధిత బ్యాంకు అధికారులకు ఆదేశాలు జారీ చేసి కట్ అయిన అమౌంట్ను తిరిగి ఇప్పించాలని కోరుతున్నామని ఈ నెలాఖరికల్లా సమస్యలు పరిష్కరించకపోతే వచ్చేనెల ఒకటో తేదీ నుండి ఎండియు వాహనాల ద్వారా రేషన్ పంపిణీ చేయడం ఆపేస్తామని వారు హెచ్చరించారు ఈ కార్యక్రమంలో మండల వైస్ ప్రెసిడెంట్ దాడి రాంబాబు, మెంబర్లు వెలుచూరి కృష్ణ, డి.రాజేష్, కె.కుమార్, ఎం.కనకరాజు, రమేష్, శంకర్, జగదీష్ పాల్గొన్నారు.

## యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

విశాలాంధ్ర - పాచిపెంట: రైతులు మొక్కజొన్న పంటలో సమగ్ర యాజమాన్య పద్ధతులను అవలంబించడం ద్వారా సాగు ఖర్చులు తగ్గించుకుని దిగుబడులు పెంచుకోవచ్చని సహాయ వ్యవసాయ సంచాలకులు మధుసూదన్‌రావు అన్నారు. మండలంలో గల మాతుమూరు గ్రామంలో ఆత్మ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రైతుల శిక్షణా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. దిగుబడులు పెరగాలంటే ప్రధానంగా భూమి సారవంతంగా ఉండాలని, రైతులు ఏక పంట విధానాన్ని కాకుండా పంట మార్పిడి అవలంబించాలని, పురుగులు తెగుళ్లపట్ల అప్రమత్తంగా ఉండాలని ఆకర్షక పంటలుగా నేల చిక్కుడు వేసుకుని రసం పీల్చు పురుగులను గుర్తించవచ్చుని, పంట చుట్టూ బంతి మొక్కలు నాటడం ద్వారా మిత్ర పురుగులను ఆకర్షించవచ్చుని అన్నారు.

సర్పంచ్ ప్రతినిధి బోను ధనుంజయ రావు మాట్లాడుతూ ఈ సంవత్సరం చిరుధాన్యాల సాగు చేపడతామని విత్తనాలు ఏప్రిల్ నెలలో ఇచ్చే ఏర్పాట్లు చేయాలని, సజ్జలు కొర్రలు ఎక్కువగా వేస్తామని, భవిష్యత్తు తరాల కోసం తప్పనిసరిగా నేల తల్లిని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. గ్రామ వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శనగల సింహాచలం మాట్లాడుతూ మాతమూరులో ఖరీఫ్, రబీ రెండు సీజన్లలో కూడా మొక్కజొన్న పంట మాత్రమే సాగు చేస్తున్నామని ఈ సంవత్సరం తప్పనిసరిగా పంట మార్పిడి విధానాన్ని చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు దినేష్, రైతులు పాల్గొన్నారు.

## ఆరోగ్య కార్యక్రమాలు ప్రజల చెంతకు చేరాలి

విశాలాంధ్ర,పార్వతీపురం: ఆరోగ్య కార్యక్రమాలు ప్రజల చెంతకు చేరాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బగాది జగన్నాథరావు అన్నారు. ఆరోగ్య కార్యక్రమాలు, సంబంధిత యాప్ లపై వైద్యాదికారులకు శిక్షణా కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా ఆసుపత్రి సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాన్ని , సంబంధిత వైద్య సేవలు పూర్తి స్థాయిలో ప్రజలకు అందాలని అన్నారు. అందుకు శిక్షణా కార్యక్రమం ఎంతగానో దోహద పడుతుందని చెప్పారు. ప్రతి ఆరోగ్య కార్యక్రమాన్ని ఏవిధంగా క్షేత్ర స్థాయిలో నిర్వహించాలి, అందుకు అవసరమైన కార్యాచరణ ఏ విధంగా చేపట్టాలి అనే అంశాలతో పాటు, సంబంధిత యాప్ లు , పోర్టల్స్ లో ఏ విధంగా అప్లోడ్ చేయాలో వివరించారు. గర్భిణీలను త్వరితగతన నమోదు చేయడం, పుట్టిన ప్రతి బిడ్డను నమోదు చేయడం, గర్భిణీలకు అవసరమైన అన్ని రకాల పరీక్షలు చేయడం తప్పనసరి అన్నారు. ఎనీమియా ముక్త భారత్ లో భాగంగా క్రమం తప్పకుండా ఆసుపత్రిలో ఆరోగ్య తనిఖీలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. పి ఎమ్ ఎమ్ వి వై , జె ఎస్ వై పథకాల నిర్వహణకు అవసరమైన డేటా ఏ విధంగా అప్లోడ్ చేయడం, ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో అందిస్తున్న వైద్య సేవలన్ని అప్లోడ్ చేయడం, ఎన్ సి డి సర్వేపై దృష్టి సారించాలని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమఇంలో జిల్లా ఆసుపత్రి సూప రింటెండెంట్, డిసి.హెచ్.ఎస్ డా.బి.వాగ్దేవి, ఆర్ బి ఎస్ కె ప్రోగ్రాం అధికారి డాక్టర్ ధవళ భాస్కర రావు, డిఐఒ టి.జగన్మోహనరావు, డిటిసిఒ శ్యామ్ కుమార్, ఎపిడిమియాలజిస్ట్ నవీన్ కుమార్ , ఎఫ్ పి సి ప్రోగ్రాం అధికారి వినోద్ కుమార్ , ప్రోగ్రాం అధికారి విజయ్ మోహన్, సిబ్బంది శంకర్, మురళీ పాల్గొన్నారు.

## బీసీలకు రాహల్‌గాంధీ క్షమాపణ చెప్పాలి

విశాలాంధ్ర - విజయ నగరం టౌన్: శుక్రవారం బిజెపి జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బిజెపి జిల్లా అధ్యక్షులు రెడ్డి పావని మాట్లాడుతూ నాలుగేళ్ల క్రితం రాహుల్ గాంధీ బహిరంగంగా బిసి సమాజాన్ని కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేసిన సందర్భంలో ఆయనకు కోర్టు విధించిన శిక్షను స్వాగతిస్తున్నామన్నారు. కోర్టు నిర్ణయం దేశంలోని చట్టం, దేశ రాజ్యాంగం అత్యున్నతమని, దాని దృష్టిలో దేశంలోని పౌరులందరూ సమానమని నిరూపించిందన్నారు. ఎంత పెద్ద వ్యక్తి అయినా నేరం చేస్తే కచ్చితంగా శిక్ష పడుతుందని, కోర్టు నిర్ణయం రుజువు చేసిందన్నారు. మన సమాజం గురించి రాహుల్ గాంధీ చేసిన అనియంత్రిత, అభ్యంతరకరమైన పద జాలాన్ని మేము అప్పుడే ఖండించడం జరిగిందన్నారు. ఇప్పటికైనా యావత్ ఒబిసి సమాజానికి రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ క్షమాపణ చెప్పి తీరాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తీగల హరినాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శులు దంతినాడ అప్పలాచారి, పతివాడ రాజేష్, జిల్లా కార్యదర్శిలు తాడి నానాజీ, బగ్గం వినీత, ఇమంది సుదీర్, మోహనా చారి, కుసుమంచి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్సార్ ఆసరా విధి విధానాలపై సమీక్ష

విశాలాంధ్ర - తెర్లాం: 3వ విడత వై.ఎస్.ఆర్. ఆసరా కార్యక్రమం గురించి పాటించవలసిన విదివిదానాల పై వెలుగు సిబ్బంది, వెల్ఫేర్ అసిస్టెంట్లతో మండలంలో శుక్రవారం వెలుగు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ మాట్లాడారు. మార్చి 31న శాసనసభ్యులు ఆధ్వర్యంలో మూడవ విడత ప్రారంభోత్సవం కార్యక్రమానికి ప్రభుత్వం వారు వై.ఎస్.ఆర్. ఆసరా పథకం ద్వారా గత రెండేళ్లలో సుస్థిర జీవనోపాధి పొందిన లబ్దిదారులు అందరినీ కార్యక్రమానికి ఆహ్వానించి మార్చి 31వ తేదీన జరుగు కార్యక్రమంలో ప్రతీ ఒక్కరూ పాల్గొనేలా చూడాలని అన్నారు.

## టీవీఎస్ ఎక్సెల్ వాహనం వేలం

విశాలాంధ్ర-నెల్లిమర్ల: నెల్లిమర్ల పోలీసుస్టేషన్‌లో ఎక్సైజ్ కేసులో సీజ్ చేసిన టివిఎస్ ఎక్సెల్ వాహనాన్ని వేలం వేయనున్నట్లు ఎస్ఐ నారాయణరావు వెల్లడించారు. శుక్రవారం వారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విజయనగరం ఒకటవ పట్టణ పోలీసు స్టేషన్‌లో ఈనెల 27వ తేదీన ఉదయం 9 గంటలకు వేలం పాట వేయనున్నట్లు చెప్పారు. ఆసక్తిగలవారు హాజరు కావాలని కోరారు.

## రాబోయే ఎన్నికల్లో టీడీపీదే విజయం



విశాలాంధ్ర - రేగిడి: ఈ రాష్ట్ర ప్రజలతోపాటు కొంతమంది ఎమ్మెల్యేలు కూడా నారా చంద్రబాబు నాయుడు నాయకత్వం రావాలని కోరుకుంటున్నారని, ఇటీవల జరిగిన మూడు పట్టభద్రుల ఎమ్మెల్సీ తో పాటు ఎమ్మెల్యే కోటాలో ఒక ఎమ్మెల్సీ తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు గెలుపొందడం అందుకు నిదర్శనమని రేగిడి ఆమదాలవలస మండలం తెలుగుదేశం పార్టీ మాజీ ఎంపీపీ కిమిడి రామకృష్ణ నాయుడు అన్నారు. శుక్రవారం తన స్వగృహంలో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్సీలు గెలుపు తెలుగుదేశం పార్టీ పూర్వ వైభవానికి నాంది అని, రాష్ట్ర ప్రజలు మార్పు కోరుకుంటున్నారని ఆయన అన్నారు.

## ఎంప్లాయిమెంటు కార్యాలయంను ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర - పార్వతీపురం: పార్వతీపురం మన్యం జిల్లాలో జిల్లా ఎంప్లాయిమెంటు కార్యాలయం ఏర్పాటు చేయాలని మన్యం జిల్లా అభివృద్ధి వేదిక కన్వీనర్ పాలక రంజిత్ కుమార్ కోరారు. రంజిత్ కుమార్ మాట్లాడుతూ మన్యం జిల్లా ఏర్పాటు జరిగి ఏడాది (గత ఏడాది ఏప్రిల్4న) కావస్తున్న జిల్లా ఎంప్లాయిమెంటు కార్యాలయం ఏర్పాటు కాలేదన్నారు. దీంతో అనేక మంది విద్యార్థులు, నిరుద్యోగులు నేటికి ఎంప్లాయిమెంటు కోసం విజయనగరం వెళ్లాల్సిన పరిస్థితే ఉందన్నారు. జిల్లా అదికార యంత్రాంగం ఎంప్లాయిమెంటు కార్యాలయం ఏర్పాటుకు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే పార్వతీపురం చర్చివీధిలోని మున్సిపల్ పార్కును రాత్రి 7 గంటలకు వరకు తెరిచి ఉంచాలని రంజిత్ కుమార్ కోరారు.

## షాపింగ్ కాంప్లెక్స్‌కు శంకుస్థాపన

విశాలాంధ్ర - గజపతినగరం: గజపతినగరంలోని జాతీయ రహదారి ప్రక్కన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ స్థలంలో 92 దుకాణాలు నిర్మించ నున్నారు. దీనికి సంబంధించి లబ్ధిదారుల చేత శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. అప్పటి మాజీ సర్పంచ్ అల్లి వరలక్ష్మి, సిపిఐ నాయకులు కీర్తిశేషులు అప్పలనాయుడు ఆధ్వర్యంలో ఈ స్థలం కోర్టులో వేసి గెలుపొందడం జరిగింది. అప్పట్లోనే గ్రామపంచాయతీ స్థలమును కోర్టులో గెలుచుకోగా ఇప్పుడు పంచాయతీకి మోక్షం కలిగింది. ఈ శంకుస్థాపన కార్యక్రమానికి మాజీ సర్పంచ్ ఆల్తి వరలక్ష్మి హాజరై కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జ్ఞాన దీపిక, సర్పంచ్ నరవ కొండమ్మ, ఉప సర్పంచ్ కర్రి రామానాయుడు, ఎంపీటీసీలు శ్రీదేవి, కళావతి, ఈవో మంత్రి రమణ తదితరులు పాల్గొన్నారు.

## దుర్గమ్మ ఆలయంలో తులాభారం ప్రారంభం

విశాలాంధ్ర-పాలకొండ: ఉత్కళాంధ్ర ఆరాధ్యదైవం పాలకొండ శ్రీకోట దుర్గమ్మ ఆలయంలో తులాభారాన్ని లాంఛనంగా శుక్రవారం ప్రారంభిం చారు. ఈ తులాభారాన్ని పార్వతీపురం ప్రాంతానికి చెందిన దుర్గప్రసాద్ అనురాధ దంపతులు రూ.50వేలు ఖర్చుతో బహూకరించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు, డి. లక్ష్మీప్రసాద్ శర్మ, ఆలయ ఈవో రాధాకృష్ణ మాట్లాడుతూ భక్తులు తులాభారంలో మొక్కులు తీర్చుకోవచ్చని తెలిపారు.

## నేడు క్రీడాకారుల ఆధ్వర్యంలో ర్యాలీ

విశాలాంధ్ర - పార్వతీపురం: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం ఉదయం క్రీడాకారులతో ర్యాలీ నిర్వహించనున్నట్టు క్రీడల చీఫ్ కోచ్ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. ర్యాలీ శనివారం ఉదయం 9 గంటలకు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం వద్ద ప్రారంభం అవుతుందని ఆయన చెప్పారు. ర్యాలీ జిల్లా కలెక్టర్ కార్యాలయం మీదుగా ఆర్.టి.సి కాంప్లెక్స్, ఆర్.సి.ఎం చేరుకుంటుందని ఆయన పేర్కొన్నారు. అనంతరం పాల్గొన్న మహిళకు అతిథులు సత్కరిస్తారని అనంతరం కార్యక్రమం ముగుస్తుందన్నారు.